ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి

నిబంధనలు అతిక్రమిస్తే 8712685257కు సమాచారం అందించాలి : సీపీ

సుబేదారి, డిసెంబర్ 29 : న్యూ ఇయర్ వేడుకలను ఇంట్లోనే ప్రశాంతంగా జరుపుకోవాలని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, తాగి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే 8712685257 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

దళారుల మాటలు నమ్మొద్దు

కాశీబుగ్గ/మడికొండ: ప్రజాపాలన కేంద్రాల పరిశీలనలో భాగంగా మున్సిపల్ స్టేడియం, దేశాయిపేటలో నిర్వహించిన కార్యక్రమాలను సీపీ సందర్శించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు దళారీల మాటలు నమ్మి డబ్బులు ఇవ్వొద్దని, ఎవరైనా డబ్బులు అడిగితే 8712685257 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట ఏసీపీ బోనాల కిషన్ ఉన్నారు. అలాగే, వరంగల్ 45, 46వ డివిజన్లలోని కడిపికొండ, రాంపూర్ గ్రామాల్లో చేపడుతున్న దరఖాస్తుల స్వీకరణ తీరును మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రేషన్ కార్డు లేకున్నా దరఖాస్తు చేయొచ్చు

వరంగల్/కాజీపేట, డిసెంబర్ 29 : అభయ హస్తం గ్యారెంటీ పథకాలకు రేషన్‌కార్డు ఉంటేనే దరఖాస్తు చేయాలన్న నిబంధన లేదని, ఆధార్ కార్డు జిరాక్స్‌తోనూ చేసుకోవచ్చని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వదంతులను నమ్మి ప్రజలు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. జిరాక్స్ యాజమాన్యాలు ప్రజాపాలన దరఖాస్తులకు అధిక డబ్బులు వసూళ్లు చేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. దరఖాస్తులను గ్రేటర్ పరిధిలోని ఏ కేంద్రంలోనైనా అందజేయవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. అలాగే, కాజీపేట ఇంపీరియల్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని తనిఖీ చేశారు.

రామలింగేశ్వరాలయంలో అరూరి పూజలు

కొబ్బరికాయ కొడుతున్న అరూరి రమేశ్

పర్వతగిరి, డిసెంబర్ 29: అనంతారం గ్రామంలో నిర్మించిన రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భాస్కరాచార్యులు, నాగేశ్వరశర్మ, గంగు నాగరాజుశర్మ ఆధ్వర్యంలో గణపతి, దేవతా పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తౌటి దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి ఇద్దరి సస్పెన్షన్

నర్సంపేట, డిసెంబర్ 29: దుగ్గొండి మండలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల బాబు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన నాచినపెల్లి సర్పంచ్ భర్త పెండ్యాల రాజు, మండల ప్రధాన కార్యదర్శి అంద్రు రత్నాకర్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిపారు. దీంతో వీరిని సస్పెండ్ చేసినట్లు స్పష్టం చేశారు.

SUMMONS FOR SETTLEMENT FOR ISSUES
IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE AT HUZURABAD
O.S. No. 245 of 2019
Between:
Dontha Ramesh ...Plaintiff
And
Katta Raghavender Rao & another ...Defendants
To,
D2) Bollepalli Kishan, S/o. Not known, Occu: Bureau Chief, Netidhatri Newspaper, Warangal Dist. Unit, R/o. H.No. 4-6-65, Opp: St.Joseph School, Kumarpalli, Hanamkonda, Warangal District.
Whereas the Plainliffs Dontha Ramesh filed suit vide OS. No. 245 OF 2019, for damages before the Hon'ble Prl. Junior Civil Judge Huzurabad. In the said suit several times the plaintiff paid process to serve summons on you, but you defendant No.2 is intentionally avoiding to take the summons. Therefore, on the application of the plaintiff the substitute service of summons ordered by the Hon'ble Court. The said suit is posted to 02-01-2024 for your appearance and written statement if any. Therefore, you (defendant No.2) are here by directed to appear before the Hon'ble Court on 02-01-2024 at 10.30 am in person or through advocate without fail, if you failed to appear on 02-01-2024 before the Hon'ble Prl. Junior Civil Judge Court at Huzurabad, the matter will be decide in you absence as per law.
"By order of the Court"
Sd/- G.SAMMI REDDY, Counsel for plaintiff, Advocate, H.No. 20-179, Vidyanagar, Huzurabad. Cell: 9391755516.

కరెంట్ లేక బల్దియాలో నిలిచిన పౌరసేవలు

వరంగల్, డిసెంబర్ 29 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో చీకట్లు అలుముకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ లేకపోవడంతో పౌరసేవలు నిలిచిపోయాయి. కార్పొరేషన్‌లోని జనరేటర్ సైతం పని చేయలేదు. దీంతో కార్పొరేషన్ కార్యాలయం అంతా చీకటిగా మారింది. దీంతో వివిధ పనులపై బల్దియా కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పౌరసేవలు నిలిచిపోవడంతో ప్రజలు పడిగాపులు పడ్డారు. కార్పొరేషన్ అవరణలోని ఇండోర్ స్టేడియంలో అరు గ్యారంటీల ధరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో కరెంట్ లేక ఇబ్బందులు పడ్డారు.

గీసుగొండ : రాంపురంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేటరూరల్ : చిన్నగురిజాలలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

వర్ధన్నపేట : ప్రజాపాలన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

కొనసాగుతున్న 'ప్రజాపాలన'

- దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు
- పలు చోట్ల పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- గ్రేటర్ పరిధిలో 50,258 దరఖాస్తులు
- హనుమకొండలో 35,771, వరంగల్‌లో 38,295

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 29 : అభయ హస్తం గ్యారెంటీలకు దరఖాస్తు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఇప్పటివరకు గ్రేటర్ పరిధిలో 50,258 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం గ్యారెంటీల కోసం 31,960, ఇతర సమస్యలపై 3008 దరఖాస్తులు వచ్చాయి. అలాగే, హనుమకొండ జిల్లాలో ఇప్పటి వరకు 35,771 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. వరంగల్ జిల్లాలో ఒక్క రోజు 38,295 దరఖాస్తులు వచ్చాయి. కాగా, పలు చోట్ల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రారంభించారు. గ్రేటర్ 8వ డివిజన్ గుడిబండల్ వద్ద, 6వ డివిజన్‌లో కుమారపల్లి మార్కెట్ వాటర్ ట్యాంక్ వద్ద, 7వ డివిజన్‌కు సంబంధించి పబ్లిక్‌గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సభలను ప్రారంభించారు. అలాగే, గీసుగొండ మండలంలోని రాంపురం, శాయంపేట, చంద్రయ్యపల్లి, హర్జ్యాతండా గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించగా రాంపురం సభకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అంతేకాకుండా ఖానాపురం మండలం దబీర్‌పేటలో జరిగిన సభలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలను ప్రారంభించారు. అలాగే, నర్సంపేట మండలం చిన్నగురిజాల, భాంజీపేటలో ఎమ్మెల్యే దొంతి పాల్గొన్నారు. వర్ధన్నపేట మండలం బండౌతాపురంలో జరిగిన సభలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. అలాగే, హసన్‌పర్తి మండలం సీతంపేటలో పాల్గొని మాట్లాడారు. అలాగే, రెండు జిల్లాల్లోని అన్ని మండలాల్లో ప్రజాపాలన సభలను నిర్వహించి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

హనుమకొండ చౌరస్తా : కుమార్‌పల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బీమాతో కార్యకర్తల కుటుంబాలకు ధీమా: పెద్ది

నర్సంపేట, డిసెంబర్ 29: బీఆర్ఎస్ అమలు చేస్తున్న బీమాతో కార్యకర్తల కుటుంబాలు ధీమాగా ఉంటున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. చెన్నారావుపేట మండలం బోడ మాణిక్యంతండా గ్రామానికి చెందిన బోడ సురేశ్ ఇటీవల విద్యుదాఘాతంతో మరణించాడు. అతడు బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో శుక్రవారం నర్సంపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రూ.2 లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు పెద్ది అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బండి రమేశ్, గోనె యువరాజు, లక్ష్మారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట 24వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు పెరుమాళ్ల రవి తల్లి రాజమ్మ మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పెద్ది పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేత గుంటి కిషన్ ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

దరఖాస్తులపై గందరగోళం

ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసే విషయంలో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని పెద్ది అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత సమస్య ఉందని, స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం 90 శాతం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా భాగస్వాములై దరఖాస్తులను పూరించి ప్రజలకు సహకారం అందించాలని కోరారు. యాసంగి పెట్టుబడి సాయాన్ని వెటనే రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే పోరాటం చేస్తామని సర్కారును హెచ్చరించారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

15 మంది మహిళా కూలీలకు గాయాలు

వర్ధన్నపేట, డిసెంబర్ 29 : ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన మండలంలోని అంబేద్కర్‌నగర్ శివారులో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లందకు చెందిన 15 మంది మహిళా కూలీలు అంబేద్కర్ సమీపంలో పనుల కోసం ఆటోలో వెళ్తున్నారు. అంబేద్కర్‌నగర్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారందరికీ గాయాలయ్యాయి. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఇదే సమయంలో ప్రజాపాలన కార్యక్రమానికి బండౌతాపురం వెళ్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆగి, క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించారు.

12 కిలోల ఎండు గంజాయి పట్టివేత

పర్వతగిరి, డిసెంబర్ 29 : మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో శుక్రవారం పోలీసులు 12 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్, పర్వతగిరి పోలీసులు సంయుక్తంగా మండలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో చింతనెక్కొండ వద్ద మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని తనిఖీ చేయగా రూ.3లక్షల విలువైన 12 కిలోల ఎండు గంజాయి లభించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన శంకర్ అశోక్ పవార్ మహారాష్ట్రలోని వాషిం జిల్లా తరాల మంగుల్పిర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు వివరించారు.

బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడి మృతి

మడికొండ, డిసెంబర్ 29 : గ్రేటర్ 45వ డివిజన్ తరాలపల్లికి చెందిన బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేరుగు రమేశ్ రైలు ప్రమాదంలో మృతి చెందగా, శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పరామర్శించారు. ఆయన వెంట కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, దర్గా సొసైటీ చైర్మన్ వనంరెడ్డి, నాయకులు రాజు, శ్రీధర్, కుమార్, రవీందర్, శ్రీకాంత్, స్పందన్, వినోద్, కర్ర హరీశ్, క్రాంతి ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

వర్ధన్నపేట, డిసెంబర్ 29: తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారి కిందపడిపోవడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన ల్యాబర్తిలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు బుర్ర వెంకటేశ్వర్లు(55) తాటిచెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో మోకు జారి చెట్టు పైనుంచి కింద పడిపోయాడు. దీంతో వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే అతడిని తోటి కార్మికులు వరంగల్‌కు తరలించారు.

ఇరిగేషన్ ఏఈపై దాడి

హసన్‌పర్తి, డిసెంబర్ 29 : ఇరిగేషన్ ఏఈపై పలివేల్పులలో కొందరు దాడి చేశారు. కేయూ పోలీసుల కథనం ప్రకారం.. భీమారం, పలివేల్పుల లోని ఎస్సారెస్పీ కెనాల్‌పై ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుంజలు పాతుతున్నారని శుక్రవారం మధ్యాహ్నం ఏఈ కిశోర్ సమాచారం అందింది. ఆయన వెంటనే విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చి, రక్షణ కోసం డయల్ 100కు ఫోన్ చేసి, భూమి వద్దకు చేరుకున్నాడు. వారిని నివారించి డోజర్‌తో కనీలను తొలగించేందుకు వెళ్తున్న క్రమంలో కొందరు డోజర్ డ్రైవర్‌పై రాళ్లు విసిరి బెదిరించారు. దీన్ని సెల్‌ఫోన్‌లో ఏఈ చిత్రీకరిస్తుండగా పుల్ల అశోక్, దేవరకొండ సుధాకర్, రజిత సెల్‌ఫోన్‌ను లాక్కొని నేలకు కొట్టారు. అనంతరం ఆయనపై దాడి చేశారు. కిశోర్ కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య నేతల సమీక్ష

రాయపర్తి, డిసెంబర్ 29: మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండలంలోని 39 గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో శనివారం సమీక్షించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ తెలిపారు. ఉదయం 8 గంటలకు అన్ని గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కేయూలో కొనసాగుతున్న ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్

మూడు సెషన్లు.. వివిధ అంశాలపై చర్చ

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29 : కేయూ ఆడిటోరియంలో రెండోరోజు 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో మూడు సమాంతర సెషన్లు జరిగాయి. మొదటి సమాంతర సెషన్ దళిత్ హిస్టరీ ప్యానెల్‌లో ఆచార్య రామచందర్‌రెడ్డి 'రూట్స్ ఆఫ్ ఇండియన్ సబ ఆల్టర్న్ లేబర్ : ట్రాజెక్టరీస్ ఆఫ్ క్యాస్ట్ ఆక్యుపేషనల్ ప్యాటర్న్స్ అండ్ ది మార్జినలైజ్డ్' అనే అంశంపై చర్చ నిర్వహించారు. న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ సీనియర్ ఆచార్యులు చిన్నారావు, ఆచార్య చిట్టిబాబు ప్యానలిస్టులుగా వ్యవహరించారు. అంబేద్కర్ దళితులు, దళిత వర్కర్స్‌కు వేతనాలు, పని పరిస్థితులు, ఇతర సామాజిక అంశాలపై చేసిన కృషిని వివరించారు. రెండో సమాంతర సెషన్ ఆలీఘర్ హిస్టోరియన్ సొసైటీ (ఏహెచ్ఎస్) ఆధ్వర్యంలో 'రీస్ట్రక్చరింగ్ ఇండియన్ ఎకానమీ థియరీ' అనే అంశంపై నిర్వహించారు. ఆచార్య ఇఫ్రాన్ హబీబ్, ఆచార్య పట్నాయక్ భారత ఉపఖండం పురాతన కాలం నుంచి సమకాలీనం వరకు మార్పులపై వివరించారు. మూడో సమాంతర సెషన్‌ను 'డెక్కన్ పాస్ట్ అండ్ ప్రెజెంట్' అంశంపై నిర్వహించారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు సంజయ్ సుబోధ్, నదీం రేజావీ డెక్కన్ ప్రాంత సూఫీ విధానాలు, పురావస్తు రికార్డులు, సాంకేతిక మార్పులపై వివరించారు.

మహాలక్ష్మి పథకంతో ఇబ్బందులు పడుతున్నాం

సమస్యలు పరిష్కరించాలని డీఎంకు అద్దె బస్సు యజమానుల వినతి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29 : మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఇబ్బందులు తప్పడం లేదని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వరంగల్-2 డీఎం సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. బస్సులలో 80 నుంచి 100 ప్రయాణికులు ఎక్కుతున్నారని, ప్రతి కిలోమీటర్‌కు బస్సును ఆపడం వల్ల కేఎంపీఎల్ రావడం లేదని, కేఎంపీఎల్‌ను ఎక్స్‌ప్రెస్ బస్సుకు 4.5గా, పల్లెవెలుగు బస్సుకు 4.8గా మార్చాలని, ప్రతినెల 10వ తేదీ వరకు బిల్లులు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. బస్సుల ఇన్సూరెన్స్ సీటింగ్ కెపాసిటీ వరకే ఉంటుందని, కంపెనీ వారితో మాట్లాడి ప్రయాణికులందరికీ వర్తించేలా చూడాలన్నారు. అలాగే టైర్స్ కూడా ప్రభుత్వంతో మాట్లాడి ఆర్టీసీకి వచ్చే రేట్‌లో ఇప్పించాలని, బస్సుల వెనుక టైర్లు ఫస్ట్, సెకండ్ రీకండిషన్‌వి వేస్తామని, ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ కారణంగా ఆ టైర్లు నడువవని, తమ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులు నల్లా నారాయణరెడ్డి, సదానందం, హబీబుద్దీన్, పీకే స్వామి ఉన్నారు.

డీఎం సురేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒకటి నుంచి సాగునీరు విడుదల

నెక్కొండ/రాయపర్తి/హసన్‌పర్తి, డిసెంబర్ 29 : ఎస్సారెస్పీ స్టేజ్-1 ద్వారా వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని నెక్కొండ, నెల్లికుదురు, కేసముద్రం మండలాల పరిధిలో ఆయకట్టుకు జనవరి 1 నుంచి 22 వరకు వారాబందీ పద్ధతిలో సాగునీరు విడుదల చేయనున్నట్లు ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోటగిరి నారాయణ తెలిపారు. కాల్వల చివరి ఆయకట్టు రైతులు బావులు, బోరు సదుపాయం ఉన్నవారు మాత్రమే ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని, కాల్వ నీటిపై ఆధారపడొద్దని సూచించారు. అలాగే, రాయపర్తి మండల రైతులకు జనవరి 8 నుంచి మార్చి 30 వరకు వారబందీ పద్ధతిలో సాగు నీరు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ శాఖ ఈఈ రమేశ్‌బాబు తెలిపారు. కాగా, కాల్వ చివరి ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని చింతగట్టు ఈఈ సీతారాం సూచించారు. హనుమకొండ జిల్లా పరిధిలో ఉన్న ఆయకట్టుకు 22 వరకు నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

పారా మెడికల్ కోర్సులో మొదటి విడుత కౌన్సెలింగ్ పూర్తి

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 29: కాకతీయ మెడికల్ కళాశాల పారా మెడికల్ కోర్సుల భర్తీకి రెండు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. 2023-24 సంవత్సరానికి పారా మెడికల్ విభాగంలో 266 సీట్లకు గురువారం డిప్లొమా ఇన్ కార్డియాలజీ, డిప్లొమా ఇన్ డయాలసిస్, డీఏఎన్ఎస్, డీఎంఎస్‌టీ, డీవోఏ, డీఈఏటీ కోర్సులు, శుక్రవారం డీఎంసీటీ, డీఆర్ఈఎస్‌టీ, డీఈసీజీ, డీఆర్‌జీవో, డీఎంఐటీ, డీడీఆర్ఏ కోర్సులకు కౌన్సిలింగ్ మొదటి విడత కౌన్సిలింగ్ నిర్వహించారు. మొదటి విడతలో 176 మంది విద్యార్థులకు వివిధ విభాగాల్లో అడ్మిషన్ అందించినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ తెలిపారు. మిగిలిన 90 సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, త్వరలో తేదీలను ఖరారు చేసి ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అదే గందరగోళం

- రెండో రోజూ దరఖాస్తుల కొరత
- సిబ్బంది నుంచి స్పష్టత లేని సమాధానాలు
- మీ సేవ, జిరాక్స్ సెంటర్ల వద్ద భారీగా ప్రజలు

హనుమకొండ/వరంగల్, డిసెంబర్ 29 : ప్రజాపాలన కార్యక్రమం రెండో రోజూ మొదటి రోజు జరిగిన తప్పిదాలే మళ్లీ జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తుల కొరత అలాగే ఉండగా, సెంటర్లలో ఏర్పాట్లు సరిగా లేకపోవడం, సిబ్బంది సరైన సమాధానం చెప్పలేక చేతులు ఎత్తేస్తున్నారు. దరఖాస్తులు అందక ప్రజలు తంటాలు పడుతున్నారు. దీంతో ముందస్తు ప్రణాళిక లేకుండా కార్యక్రమం ఎందుకు ప్రారంభించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో దూరం నుంచి వస్తుంటే దరఖాస్తులు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరి కొందరు జిరాక్స్ సెంటర్లు, మీ సేవ కేంద్రాల వద్ద గుమిగూడుతున్నారు. పరిస్థితిని ఆసరాగా చేసుకుంటున్న నిర్వాహకులు భారీగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దరఖాస్తు ఫారాలు అందక ఆగమాగం

శాయంపేట : ప్రజాపాలన దరఖాస్తుల కొరతతో జనం ఆగమవుతున్నారు. శాయంపేటలో ఇంటింటికీ తిరిగి దరఖాస్తులు ఇస్తారని చెప్పినా చాలా మందికి రాలేదని చెప్పారు. శుక్రవారం మండలంలోని గట్లకానిపర్తి, కాట్రపల్లి, ప్రగతిసింగారం, నూర్జహాన్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. మండల స్పెషలాఫీసర్ హరిప్రసాద్, తహసీల్దార్ సుభాషిణి, ఎంపీవో రంజిత్ దరఖాస్తులను స్వీకరించారు. శాయంపేట జీపీలో దరఖాస్తులున్నా ఇవ్వడం లేదని, అక్కడికి వెళ్తే రేషన్‌కార్డు తీసుకురమ్మన్నారని ఓ యువకుడు చెప్పాడు. ఇంటికో రేషన్‌కార్డు అంటే కొడుకుల కుటుంబాలకు ఇవ్వడం లేదని జనార్దన్ వాపోయాడు.

ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండ

చెక్కు అందజేస్తున్న నన్నపునేని నరేందర్

గిర్మాజీపేట, డిసెంబర్ 29: ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా నిలుస్తున్నదని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 12వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మంచోజు శివ ప్రమాదవశాత్తు మరణించగా, శుక్రవారం అతడి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల విలువైన ఇన్సూరెన్స్ చెక్కును నరేందర్ శివనగర్‌లోని తన కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కావటి కవిత పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట, డిసెంబర్ 29 : మండలంలోని పత్తిపాకకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వైద్యుల వీరారెడ్డి మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి చనిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం వీరారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

పేదల సంక్షేమానికి అనేక పథకాలు

కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29 : దేశంలోని పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల సహాయ మంత్రి బీఎల్ వర్మ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం జేఎన్ఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పలువురికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, డీఎంహెచ్‌వో సాంబశివరావు, బీజేపీ నాయకులు చొల్లేటి కృష్ణమాచారి, బైరి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, మూడు రోజుల పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనకు వచ్చిన మంత్రి బీఎల్ వర్మకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు నేతృత్వంలో బీజేపీ నేతలు నిట్ గెస్ట్ హౌజ్ వద్ద స్వాగతం పలికారు.

'ముస్లింలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను విస్మరిస్తున్నదని తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అఖిల్‌పాషా అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.